## క్లుప్తంగా

### విద్యుత్ బిల్లు ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలి

కొల్లిపర: మండల పరిధిలోని 20 గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఫోన్‌పే, గూగుల్ పే, మీసేవా,లేదా దావులూరు అడ్డరోడ్డు వద్ద ఉన్న కరెంట్ కార్యాలయంలో మాత్రమే విద్యుత్ బిల్లు చెల్లించాలని మండల విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రం విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో నిన్నటి వరకు విద్యుత్ బిల్లు కట్టించుకొనే బిల్లు కలెక్టర్‌కు కాంట్రాక్టర్ గడువు ముగిసిపోవటంతో అతను విద్యుత్ బిల్లు కట్టించుకోవటానికి ఇక రాడన్నారు. వినియోగదారులకు అందించే విద్యుత్ బిల్లు క్రింద విద్యుత్ కంపెనీ వారు క్యూఆర్ కోడ్ కూడా ఇస్తున్నారు. ఈ కోడ్ ఫోన్ లో స్కానింగ్ చేసి నేరుగా చెల్లించవచ్చు అని వివరించారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి పైన తెలిపిన విధంగా నేటి నుంచి విద్యుత్ బిల్లు చెల్లించాలని కోరారు.

### వైభవంగా గీతా రథయాత్ర



తెనాలి: గీతాజయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో వైభవంగా గీతా రథయాత్రను నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని కోదండరామాలయం నుండి గోవర్ధన స్వామి ఆలయం వరకు గీతా రథయాత్ర సాగింది. సీతారాములతో లక్ష్మణుడు, ఆంజనేయుడు, శ్రీకృష్ణ భగవాన్ విగ్రహాలను అలంకరించి ఊరేగించారు. భజరంగదళ్, తెనాలిశాఖ, విశ్వ హిందుపరిషత్, హిందూ చైతన్యవేదిక కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. త్రిదండి చినజీయర్ స్వామి శిష్యుడు నరేంద్రస్వామి హారతిచ్చి రథయాత్రను ప్రారంభించారు. అవ్వారు శ్రీనివాసరావు, అంబటి మారుతివరప్రసాద్, పొట్టిమూర్తి, శ్రీనివాసరావు పర్యవేక్షించారు. రామాంజనేయులు, శేఖర మూర్తి, చరణ్ ,రమాదేవి, శారద, విజయలక్ష్మి, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు. గోవర్ధనస్వామి దేవాలయానికి చేరుకున్న రథయాత్రకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. హారతులిచ్చి పూజలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు.

### నేడు కేంద్రీయ విద్యాలయ క్రీడాదినోత్సవం

తెనాలి: సమీప జగ్గడిగుంటపాలెంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. కేంద్రియ విద్యాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ వేడుకలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని కేవీఎస్, ఆర్‌ఓ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఎం.రాజేశ్వరరావు పాల్గొంటారు. విశిష్ట అతిథులుగా తెనాలికి చెందిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షేక్ షబీనా, పారా ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు పి.నాగరాజు పాల్గొంటారని వివరించారు.

### నేడు ప్రముఖ కవి రావినూతల శ్రీరామమూర్తి వర్ధంతి



తెనాలి: రూరల్ మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత అసిస్టెంట్ ఇంజినీరు రావినూతల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించనున్నారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రజ్వలిత సంస్థల సహకారంతో రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగలకుదురులోని కళ్యాణ మండపంలో జరిగే వర్ధంతి సభలో ఫొటో ఎగ్జిబిషన్, ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తారు. మాజీ జడ్పీటీసీ శాఖమూరి నారాయణ ప్రసాద్ (చిన్నా), కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, మా-ఏపీ అధ్యక్షుడు/సినీదర్శకుడు దిలీప్‌రాజా, గణేష్ యూత్ వీరవల్లి మురళి పాల్గొంటారని వివరించారు.

### సత్రం ఆవరణలో దుకాణాల తొలగింపు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని లోకల్ ఫండ్ సత్రం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆవరణలోని దుకాణాలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, దేవదాయ శాఖ, గ్రామ పెద్దల సమక్షంలో దుకాణాలలోని కలప తదితర వస్తువులను భద్రపరిచారు. అధికారుల ఆదేశానుసారం ఆయా వస్తువులకు వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. రూ.70 లక్షల వ్యయంతో ఈ లోకల్ ఫండ్ సత్రం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో వీఆర్వో శివరామకృష్ణ, గ్రామ పెద్దలు మోటూరు పుణ్యశ్రీనివాసరావు (చినబాబు), ఎంపీటీసీ సభ్యు లు వాకా వెంకటనారాయణ, పోలీస్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కప్పిపుచ్చి.. కళ్లుగప్పి..!!

- అంగలకుదురులో పచ్చపాలకుల కుటిలయత్నాలు
- గత ప్రభుత్వ అభివృద్ధి కనపడకుండా కుట్ర
- ఎన్నికల ఫలితాలొచ్చి ఆరునెలలు దాటినా తొలగని వరదాలు



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు

తెనాలిరూరల్: గత వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇప్పటి పాలకులు మాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఆదరణకు నోచుకోని రోడ్లు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అలాంటిది ఆ నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు ధ్వంసం చేయడంతో పాటు ముఖద్వారాలను సైతం కప్పి ఉంచుతున్నారు. తెనాలి మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన అంగలకుదురు గ్రామం 2019కు ముందు వరకు ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్ సీపీకి అనుకూలం కాకున్నా అంగలకుదురు గ్రామం, గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. అయితే వీటిని కనపడకుండా చేసేందుకు కుట్రలు జరు

#### అభివృద్ధి గుర్తుల్లేకుండా చేసే యత్నం

గుతున్నాయన్న అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. దశాబ్దాలుగా టీడీపీ, కాంగ్రెస్ పాలనలో గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి జెడ్పీ హైస్కూలు, రైల్వే స్టేషనుకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఈ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మించారు. దీనికి అన్నాబత్తుని శివకుమార్ ద్వారం పేరిట ముఖద్వారం ఏర్పాటు చేశారు. అలానే మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేర్లు పిల్లర్లపై వేయించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అన్ని విగ్రహాలతో పాటు ఈ ద్వారానికి పట్టాలను కప్పారు. ఇప్పటికీ ఆరు నెలలు దాటినా ఇంకా పట్టాలను తొలగించనే లేదు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు మరచిపోవాలన్న ఉద్దేశంతోనే ప్రస్తుత పాలకులు ఈ పట్టాలను తొలగించనీయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ముఖ ద్వారానికి తొలగించని పట్టాలు

#### సంక్షేమ వరద..

ఒక్క అంగలకుదురు గ్రామంలోనే 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2024 ఎన్నికల వరకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ. 27,23,28,477 ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. అమ్మ ఒడి పథకం కింద 354 కుటుంబాలకు రూ. 1,56, 04,000 ప్రభుత్వం అందించింది. విద్యా దీవెన కింది 203 కుటుంబాలకు రూ. 2,21,27,500 చెల్లించారు. గత ప్రభుత్వంలో 840 మందికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారు. ప్రస్తుతం 1135 మందికి ఇస్తున్నారు. ఈబీసీ నేస్తం కింద 119 కుటుంబాలకు రూ. 31,20,000 అందించారు.

గత ప్రభుత్వ హయాంలో ఆశించిన స్థాయికన్నా ఎక్కువగా అభివృద్ధి చెందింది.

#### 2019-24 వరకు అభివృద్ధి పరుగులు

అంగలకుదురు నుంచి కోపల్లె గుడివాడ వరకు అంగలకుదురు-కొలకలూరు ఆర్అండ్‌బీ రోడ్డును రూ. రెండు కోట్లతో ప్రత్యేక మరమ్మతులు చేయించారు. అంగలకుదురు సెంటరు నుంచి రైల్వే స్టేషన్ వరకు జెడ్పీ హైస్కూలు మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని చాలా సంవత్సరాలుగా స్థానికులు కోరుతున్నా పట్టించుకున్న నాయకుడు లేడు.

#### అన్నాబత్తుని చొరవతో...

అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఈ విషయంపై ప్రత్యేక చొరవ చూపి సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు మరో రూ. 50 లక్షలతో అంగలకుదురు-కొలకలూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పల్లెకు వెళ్లే రోడ్డును నిర్మించారు. 'నాడు-నేడు' పథకం కింద గ్రామంలోని జెడ్పీ హైస్కూలు రూ. 1.12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశారు. అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 11 లక్షలు కేటాయించారు. వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనం, సచివాలయాలు, రోడ్లు, చెరువు అభివృద్ధి వంటి కార్యక్రమాలకు రూ. ఐదు కోట్లు కేటాయించి పనులు పూరి చేశారు.

## రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయండి

అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: చెత్త సేకరణ వివరాలు ప్రతి రోజు రిజిష్టర్‌లలో నమోదు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 6,7,11,12,16 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. నగరదీపికల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరించడంతో పాటు వాటి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజల నుంచిఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### 14 మండల పరిషత్ సమావేశం

తెనాలిరూరల్: తెనాలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14న న్విహించనున్నట్టు ఎంపీడీవో అత్తోట దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

# త్వరగా చెత్త తరలించండి

సబ్ కలెక్టర్ సంజనా సింహ



కమిషనర్ శేషన్నకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డులో ఉన్న వ్యర్థాల గుట్టలను త్వరగా బయటకు తరలించే విధంగా చూడాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహ ఆదేశించారు. బుధవారం ఆమె కంపోస్టు యార్డును పరిశీలించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వ్యర్థాల గుట్టల వలన ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె కంపోస్టు యార్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. తరలింపునకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న నుంచి సేకరించారు. మార్చి నెలాఖారు లోపు చెత్తను పూర్తిగా తరలిస్తామని, అందుకు అవసరమైన టెండర్లు పిలవడం జరిగిందని ఆయన చెప్పారు. కాంట్రాక్టర్ రెండు రోజుల్లో పని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరోసారి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలవురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



### ప్రభువు రాక కోసం...

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని తెనాలి మారీసుపేటలోని రెండు గేట్ల మధ్యలో భారీ నక్షత్రాన్ని స్థానికులు ఏర్పాటు చేశారు. దానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

–తెనాలిఅర్బన్

## మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని మూడు, నాలుగు వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న చెత్తసేకరణ పనులను పరిశీలించారు. తెనాలి పట్టణంలో నూరు శాతం చెత్తసేకరణ జరగాలన్నారు. ప్రతి ఇంటికి కార్మికులు వెళ్లి చెత్త సేకరించాలని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

### భగవద్గీత ప్రతి ఒక్కరూ ఆచరించదగినది

భట్టిప్రోలు: శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆచరించదగినదని ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలోని అభయాంజనేయస్వామి, అద్దేపల్లిలోని అమ్మవారి చెట్టు వద్ద రామాలయంలో సామూహిక హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమశంకరరావు మాట్లాడుతూ భగవద్గీత ప్రపంచ మానవాళికి మార్గదర్శి అని, గీతను పఠించడం ద్వారా వ్యక్తిగత, కుటుంబ, సామాజిక పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ కుక్కల రాజ్యలక్ష్మి, బూర్లె అరుణ కుమారి, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

డీఎస్పీ జనార్ధనరావు



మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ బి. జనార్ధనరావు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద బుధవారం రాత్రి 'వారధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు మోసం చేసే విధానం, నేరాలకు పాల్పడేందుకు ఏ విధంగా మోసపూరిత ఫోన్ కాల్స్ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు పంపుతారన్న అంశాలపై షార్ట్ ఫిలింలను ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఏ బ్యాంకు, రుణ సంస్థలు ఫోన్ చేసి ఆధార్, పాన్, ఓటీపీలు వంటి వివరాలను అడగవని, అటువంటివి అడిగితే ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లేనని గుర్తించాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లలో ఉండే లింక్‌లను క్లిక్ చేయకూడదన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్లు మోసాలకు పాల్పడతారని, అపరిచిత వ్యక్తులను నగదు డ్రా చేయమని కోరవద్దని చెప్పారు. సైబర్ కేటుగాళ్ల బారిన పడి లక్షల్లో నగదు పోగొట్టుకున్న బాధితులు తెనాలిలో ఉన్నారని చెబుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు వేషధారణలో వీడియోకల్ చేసి మీ పేరిట లేదా మీ పిల్లల పేరిట విదేశాల నుండి కొరియర్ వచ్చిందని, అందులో నిషేధిత మాదకద్రవ్యాలు ఉన్నాయంటూ ఎటూ కదలకూడని ఆజ్ఞాపిస్తారని, అటువంటి సందర్భం ఎదురైతే కాలల్‌ను వెంటనే కట్‌చేసి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులకు ఆధార్, పాన్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో త్రీ టౌన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## కాల్వలు ప్రతిరోజు బాగు చేయించేలా చూడండి

31వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



స్థానికుల సమస్యలు వింటున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ప్రతిరోజు మురుగు కాల్వలను బాగు చేయకపోవడం వలన దుర్గంధభరితంగా మారుతున్నాయని, వాటిని బాగు చేయించే విధంగా చూడాలని 31వ వార్డు ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. 31వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులోని మురుగు కాల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మరికొందరూ కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్‌కుమార్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీస్తు పుట్టుకలోని ఆంతర్యాన్ని తెలుసుకోండి



కేక్‌కట్ చేస్తున్న పాస్టర్ శ్యామూల్, ప్రభుదాసు

తెనాలిఅర్బన్: యేసుక్రీస్తు పుట్టకలోని ఆంతర్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రెవరెండ్ ఎం.లీలా, రెవరెండ్ పల్లె శ్యామూల్‌లు పేర్కొన్నారు.19వ వార్డులోని స్తుతి సువార్త చర్చిలో బుధవారం సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ప్రపంచంలోని అన్ని దేశాలు ఎంతో ఘనంగా జరుపుకుంటాయని తెలిపారు.
ఏసుక్రీస్తు చూపిన క్షమ, దయ గుణాలను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశా రు. అలాగే నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఝాన్సీరాణి, రోహి, సలోమి, ప్రభుదాసు, కిషోర్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

## నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

మెప్మా పీడీ వి.విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న మెప్మా పీడీ వి.విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: సర్వేల పేరిట మహిళల నుంచి నగదు వసూలు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెప్మా గుంటూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి హెచ్చరించారు. ఈ నెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో సర్వే పేరిట ఆర్పీల దందా శీర్షికన కథనం వెలువడిన విషయం తెలిసిందే. బుధవారం తెనాలి వచ్చిన ఆమె మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సాక్షిలో వచ్చిన కథనంపై ఆరా తీశారు. మరోసారి అలాంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సర్వేను ఈ నెల 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే వారి వివరాలను కూడా త్వరగా సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై ఆమె సమీక్ష జరిపారు. సమావేశంలో మెప్మా అధికారి జె.రవికాంత్, తెనాలి సిటీ మిషన్ మేనేజర్ జి.విజయకుమారి, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

ఖాజీపాలెం(కర్లపాలెం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్, ఎంకేఆర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును 3 నెలలు ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ యువకులు డిసెంబర్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 9640695229 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

## కేరళ రాష్ట్రంపై బీజేపీ వివక్షను మానుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



రేపల్లె రూరల్: కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్ష మానుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంకు సంఘీభావంగా బుధవారం సాయంత్రం సీపీఎం కార్యాలయంలో పలు ప్రజా సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళ రాష్ట్ర ప్రజలకు ప్రజా తంత్రవాదులు, ప్రజలు అండగా నిలవాలన్నారు. కేరళ ప్రజల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలన లేని రాష్ట్రాలను శాసిస్తూ తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కేరళలో సీపీఎం నాయకత్వంలో ఉన్న వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు, అడ్డంకులు కల్పించి న్యాయపరంగా రావాల్సిన నిధులను రాకుండా అడ్డగిస్తోందన్నారు. రాష్ట్ర సంక్షేమానికి అప్పులు చేయటానికి అనుమతులు సైతం నిరాకరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ కేరళ రాష్ట్రంపై కక్షపూరిత రాజకీయాలను మానుకోవాలన్నారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు కేవీ లక్ష్మణరావు, గోపి,కె.ఝాన్సీ, కె.సాయిప్రసాద్, జే ధర్మరాజు, కృష్ణప్రసాద్, ఎం.సూర్యప్రకాష్, కే నవీన్ పాల్గొన్నారు.

### సాధన మండలిలో గీతా జయంతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం 50వ వార్షికోత్సవం, గీతా జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన కావించి పాదుకలకు అభిషేకాలు, జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మకు అష్టోత్తర శతనామాలతో పూజ, శ్రీమద్భగవద్గీతా పారాయణ, కర్పూర యజ్ఞం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ఆత్మూరి వెంకట సుబ్బారావు, బూర్లె సుధీర్‌లు ప్రసాదాలు అందజేశారు. గురువారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం జరుగుతుందని, ఉదయం రిటైర్డ్ సైన్స్ ప్రొఫెసర్ (రఘుచంద్ర దాసు) కేవీఎస్ రావుచే ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతుందని సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి తెలిపారు.